# జయాప జయాలు

ఎస్. వెంకటేశ్వరరావు



డ్రైవర్ సీతాపతి కండక్టరు మాధవరావుని కేకేసి కాఫీలకు దిగిన ప్యాసెంజర్లను తిరిగి బస్సులో ఎక్కించమన్నాడు. షెడ్యూల్ టైముకు అరగంట ఆలస్యమయిందని తొందరచేశాడు. ప్యాసింజర్లంతా తిరిగి బస్సులోకి ఎక్కారు. బస్సు కదిలింది. తన దృష్టిని డ్రైవింగ్ మీద కేంద్రీకరించాడు సీతాపతి. బస్సు రెండు, మూడు కిలోమీటర్ల దూరం పోగానే వెనకనుంచి వేరొక బస్సు సైడు ఇవ్వమన్నట్టుగా హారన్ పదేపదే మోగించింది. సీతాపతి సైడు మిర్రర్‌లోకి దృష్టి సారించాడు. వెనుక వస్తున్నది టూరిస్టు బస్సు. టూరిస్టు బస్సు డ్రైవర్

హారన్‌మీద చేయి తీయకుండా మోగిస్తున్నాడు, సీతాపతి ఆలోచిస్తున్నాడు సైడు ఇద్దామా వద్దా అని. టూరిస్టు బస్సుకు సైడు ఇచ్చి దాన్ని ముందుకు పోనిచ్చి తాను ఎందుకు వెనుకపడాలా అని అభిమానం వచ్చి వెంటనే స్పీడు పెంచాడు. సీతాపతి బస్సు స్పీడు పెరగటం చూచి టూరిస్టు బస్సుకూడా స్పీడు అందుకుంది. నువ్వా, నేనా అన్నట్టు హేమాహేమీలు పోటీపడ్డట్టు రెండు బస్సులు దూసుకుపోతున్నాయి. ఐతే ఒకచోట గడ్డిబండి అడ్డం రావటంతో, సీతాపతి విధిలేక స్పీడు తగ్గించాడు. దానితో గత్యంతరంలేక టూరిస్టు బస్సు స్పీడుకూడా క్రమంక్రమంగా తగ్గింది. అదృష్టవశాత్తు సీతాపతి బస్సు గడ్డిబండిని దాటివెళ్ళింది. కాని గడ్డిబండిని లాగుతున్న ఎడ్లుతమపక్కగా ఒక బస్సు స్పీడుగా వెళ్ళటంతో బెదిరిరోడ్డు మధ్యకు అంటే టూరిస్టు బస్సుకు అడ్డంగా వచ్చాయి క్రీ....క్ అని బ్రేకు పడింది టూరిస్టు బస్సుకు. ఎడ్లబండిని తోలేవాణ్ని బండబూతులు తిట్టాడు టూరిస్టు బస్సు డ్రైవర్. మరో సమయంలో అయితే బస్సుదిగి తన్నేవాడే. కాని అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకోకూడదనుకున్నాడు. ఎదుటి బస్సు డ్రైవర్ పని చూడాలనుకున్నాడు. ఎడ్లబండి అడ్డం తొలగగానే ఒక్కసారి బండిని ముందుకు దూకించాడు. కాని లాభంలేకపోయింది. ముందు బస్సు కనుచూపుమేర అందకుండా పోయింది. విసుగుతో, కోపంతో ఎడమచేతిని స్టీరింగు మీద కొట్టాడు.

సీతాపతి ముందు స్టాపులో బస్సు ఆపాడు. ఈ అనుకోని పోటీవలన సైము కలిసొచ్చింది. కరెక్టు టైము కొచ్చాము అనుకున్నాడు. ప్యాసెంజర్లు కాఫీకోసం క్యాంటీన్‌లోకి జొరబడ్డారు, సీతాపతి కూడా అలసటగా లోపలకు దారి తీశాడు. కాఫీతాగి మూతి తుడుచుకున్నాడు. బస్సు దగ్గరకు వచ్చి టైర్లను పరీక్షిస్తున్నాడు. వెనుక నుంచి ఎవరిదో కఠంఠ్వంగా వినిపించింది.

"అయితే మీరే నన్న మాట ఇందాకటి బస్సు డ్రైవర్" అన్నాడు క్రూరంగా చూస్తూ టూరిస్టు బస్సు డ్రైవర్.

అవును అన్నట్టు తలూపాడు సీతాపతి.

"పోటీ పడాలంటే ఇద్దరూ సమానంగా ఒకేసారి బయలుదేరినప్పుడు పెట్టుకోవాలి గాని ఒకళ్ళు ముందు ఉన్నప్పుడు పెట్టుకునేదికాదు" అన్నాడు టూరిస్టుబస్ డ్రైవరు ఈసడింపుగా.

"పోటీ పడాలని రాలేదు. నా మామూలు స్పీడులో నేను వచ్చాను" అన్నాడు సీతాపతి శాంతంగా.

"కాదు నువ్వు కావాలనే సైడు ఇవ్వకుండా వచ్చేవు" దూషించినట్టు అన్నాడు టూరిస్టు డ్రయివర్.

"ఐతే ఏమంటావు" సీతాపతి గంభీరంగా అడిగాడు.

"ఇందాకటిది పోటీ కాదంటాను. పందెం కాస్తే ఎవరు స్పీడుగా బస్సు తోలగలరో చూపిస్తానంటున్నాను" అన్నాడు టూరిస్టు డ్రైవరు ఎట్టుదలగా. ఇంతలో టూరిస్టు బస్సులో ప్రయాణం చేస్తున్న విద్యార్థులు వచ్చేరు.

"ఈ మొహమేనా ఇందాక మనకు సైడు ఇవ్వకుండా ముందుపోయింది?" ఒక విద్యార్థి సీతాపతిని చూస్తూ అడిగాడు.

"అవును అందుకే పందెం కాయమని ఛాలెంజ్ చేసిఅడుగుతున్నాను" అనిటూరిస్టు డ్రైవరు అన్నాడు. దానితో విద్యార్థులు సీతాపతిని బాగా రెచ్చగొట్టారు. పందెం అంటే నీకేం తెల్సు మా డ్రైవర్ ముందు నువ్వెందుకూ పనికిరావు అన్నారు. సీతాపతికి పౌరుషం ముంచుకొచ్చింది. వెంటనే ఒప్పుకున్నాడు. ఇద్దరు డ్రైవర్లు తమ తమ వాచీలు పందెంగా పెట్టారు. ప్యాసింజర్లను తొందరచేసి బస్సు ఎక్కించేడు

సీతాపతి. ముప్ఫైమైళ్ళ దూరాన ఉన్న ఒక ఊరికి ఎవరు ముందు చేరితే వాళ్ళుగెలిచినట్లుగా నిర్ణయించుకున్నారు. ఆ ఊరివరకు సీతాపతి ఆగేపని లేదు. అందువలన ఒప్పుకున్నాడు, ఒక ఖాళీ ప్రదేశంనుండి రెండు బస్సులు ఒక్కసారిగా బయలుదేరాయి. రెండు సమానంగా రోడ్డు మీదికొచ్చాయి. రోడ్డు మీద ఈ రెండు బస్సులే ఉన్నట్టయితే పోటీ బాగుండేది కాని ఎదురుగా వచ్చే ట్రాఫిక్‌ని కూడా తప్పించుకోవాలి. అందువలన వేగాన్ని నిలబెట్టడం కుదరదు.

కొద్ది దూరం పోయేటప్పటికి ఎవరు ముందు పోగలరో తెలిసిపోయింది. సీతాపతికి మంచి అనుభవం ఉంది. అదీగాక ఈ రూట్‌పై చాలాసార్లు తిరిగాడు. అందువలన టూరిసు బస్సుకంటే ముందే పోతున్నాడు. బస్సులోని ప్రయాణీకులు బస్సు స్పీడుకు అదిరిపోతున్నారు. కిటికీలలోంచి గాలి బొంయ్‌మని కొడ్తూంది. ఆడవారు పిల్లలను గట్టిగా పట్టుకున్నారు. కొంతమందికి వాంతి వచ్చేట్లు ఉంది.

టూరిస్టు బస్సు వెనుకబడేటప్పటికి అందులోని విద్యార్థులకు నిరాశ కలిగింది. ఇంకా స్పీడుగా పొమ్మని వత్తిడి చేశారు. డ్రైవర్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. కాని టర్నింగ్సులో తప్పనిసరిగా స్పీడు తగ్గించవల్సి వస్తుంది. దాంతో విద్యార్థులు రెచ్చిపోతున్నారు. నువ్విలాటి చచ్చు డ్రైవర్‌వని తెలిస్తే పందెం కాయనిచ్చేవాళ్ళముకాము అన్నారు. కాని టూరిస్టు బస్సు డ్రైవర్ నిస్సహాయస్థితిలో ఉన్నాడు. తానుఎంత ప్రయత్నించినా ముందుబస్సును దాటలేకపోతున్నాడు. పళ్ళు బిగపట్టి పట్టుదలగా డ్రైవ్ చేస్తున్నాడు.

సీతాపతి మిర్రర్‌లో నుంచి వెనుక బస్సును చూశాడు. తన బస్సుకంటే ఇరవై గజాల దూరంలో వుంది. తను ఒక్క చిన్న పొరపాటు చేసినా వెనుక బస్సు తనను దాటిపోతుంది. అందుకని జాగ్రత్తగా వున్నారు. రెండుసార్లు వెనుక



# విమానావమానాలు

బొల్లిగద్ద శవాల్ని భోంచేసి
బెల్లి బరువెక్కి, ఎగర్లేక నడుస్తోంది,
డొక్క నెప్పితో తిండి తిన్లేక
చిక్కి శల్యమైన మనిషి
నడవలేక 'ఫ్లై' చేస్తున్నాడు,
గరుత్మంతుడు చేసేపని
హనుమంతుడి వారసుడైన
మనుష్యమాత్రుడు చేస్తున్నాడు,
తాను విమానిస్తున్నాడు!
పక్షుల్ని అవమానిస్తున్నాడు!

—దాశరథి

---

బస్సు సీతాపతి బస్సుతో సమానంగా వచ్చింది. ఐతే ఎదురుగా వస్తున్న ట్రాఫిక్‌కి దారి ఇవ్వవలసి వచ్చి మళ్ళా వెనక పడింది. ఎందుకంటే సీతాపతి బస్సును టూరిస్టు బస్సుదాటాలంటే, రోడ్డుకు రైటు సైడుగావచ్చి ముందుకు చేరాలి. కాని ఈ రైటు సైడు పై ఎదురుగా వచ్చే వాహనాలు వెళతాయి. అందువలన ముందుకు చేరలేక పోయాడు.


కాని ఇప్పుడు రెండుబస్సులుసమానంగా వెళుతున్నాయి. అదృష్టవశాత్తు కనుచూపు మేర ఎదురుగా వచ్చేవాహనమేదీ కన్పించ లేదు. ఈ దెబ్బతో ఎవరు ముందుపోయేది. వెనక పడేది తేల్చుకో వాలనుకున్నాడు టూరిస్టు డ్రైవర్ ఈ సారి ముందు వచ్చే వాహనాలకు దారి ఇవ్వ కూడదనుకున్నాడు. ఎదుటివాళ్ళే రోడ్డు దిగి దారి ఇవ్వాలి అనుకున్నాడు. సీతాపతి టూరిస్టు బస్సు తనతో సమానంగా రావటం చూసేడు. మొత్తానికి వెనుక డ్రైవరు గట్టివాడేననుకున్నాడు. హఠాత్తుగా ఎదురుగా ఒక లారీ వస్తూ కన్పించింది. ప్రక్కకు చూశాడు. టూరిస్టు డ్రైవరు సైడ్ ఇచ్చేఉద్దేశంలో కన్పించలేదు. ఎడమ కన్ను అదిరింది. ఏదో దుర్ఘటన జరుగుతుందనుకున్నాడు. టూరిస్టు బస్సు ఎదురు లారీకి సైడు ఇవ్వకపోతే యాక్సిడెంటు ఖాయం. రోడ్డుమీద రెండు వాహనాలకే చోటు ఉంది. రోడ్డు పక్కగా ఆట్టే చోటు లేదు. ఇప్పుడు గత్యంతరం ఒక్కటే తాను స్పీడు తగ్గిస్తే టూరిస్టు బస్సు ముందుకుపోయి లెఫ్ట్‌కి వస్తుంది. అప్పుడు లారీ నిరాటంకంగా వెళ్ళిపోతుంది కాని స్పీడు తగ్గించటమంటే చేతులారా పందెం ఓడినట్టే. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. లారీ దగ్గరవుతోంది.

బస్సులో ప్యాసింజర్లవంక చూసేడు. బస్సు స్పీడుకి కొందరికి తిమ్మిరెక్కిపోయింది. కొందరు వయసు మళ్ళినవారు భయంతో సీతాపతి చూశారు స్పీడు తగ్గించమన్నట్టుగా కొందరు స్త్రీలు ఒక చేతో పిల్లలను, మరొక చేతితో ముందు సీటును పట్టుకున్నారు. సీతాపతి బుర్ర వేడెక్కింది. ఒక పక్క పందెం మరో పక్క ప్రయాణీకుల క్షేమం. ఒక ప్రక్క పౌరుషం, మరొక ప్రక్క ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రయాణీకులు దెబ్బతింటారని జాలి, ఔదార్యం - కారుణ్యం. జాలి - పగ, ప్రయాణీకుల క్షేమం — వాటీ పందెం. మానవత్వం. పౌరుషం. టూరిస్టు బస్సులోని విద్యార్థులు సీతాపతిని గేలిచేస్తున్నారు. సీతాపతికి ఇక ఆలోచించే సమయంలేదు. లారీ ఫర్లాంగు దూరంలోనేఉంది. వెంటనే ఏదో ఒకటి చేయా లనుకున్నాడు. అనుకోకుండా సీతాపతి బస్సు స్పీడు తగ్గటంచూచి టూరిస్టు బస్సు డ్రైవర్ ఆశ్చర్యపోయాడు. కాని ఎదురుగా వస్తున్న లారీని చూసి చటాలున బస్సుని లెఫ్ట్‌కి తీసుకొచ్చాడు. ఎందుకంటే

అప్పుడు సీతాపతి బస్సు వెనుకపడింది. ఆ టూరిస్టుబస్సు వాయువేగంతో వెళ్ళిపోయింది ముందుకు. సీతాపతి బస్సుస్పీడు తగ్గించి ప్రయాణీకులను చూశాడు అంతా కుదుటబడ్డారు. కొందరు కృతజ్ఞతాపూర్వకంగా చూశారు. సీతాపతి ఇప్పుడు వాచీ పోయిందని దిగులుపడటంలేదు. టూరిస్టు డ్రైవర్, అందులోని విద్యార్థులు హేళన చేస్తారని బాధపడటం లేదు. తన పందెంకంటే ప్రయాణీకుల క్షేమం ముఖ్యమని తృప్తిపడ్డాడు.

అనుకున్న ఊరికి సీతాపతి బస్సు వచ్చి ఆగింది. సీతాపతి మెల్లగా బస్సుదిగాడు. అంతకు ముందే వచ్చిచేరిన టూరిస్టు డ్రైవర్ విద్యార్థులు విజయగర్వంతో ఉన్నారు. సీతాపతిని చూడగానే ఒక విద్యార్థి హి. హి. అని ఇకిలించాడు. సీతాపతి శాంతంగా వెళ్ళితనవాచీఇచ్చేశాడు. టూరిస్టు బస్సు డ్రైవర్‌కి రొమ్ములు పొంగాయి విజయగర్వం సాధించినందుకు.

మొదట సీతాపతి బస్సులోని ప్రయాణీకులకు పందెం సంగతి తెలియదు. కేవలం పంతంకోసం టూరిస్టు బస్సుతో పోటీ పడ్డాడని అభిప్రాయపడ్డారు. కాని సీతాపతి వాచీ పొయ్యేటప్పటికి వాళ్ళకు కూడా బాధ కలిగింది. తమ క్షేమంకోరే సీతాపతి స్పీడు తగ్గించి పందెం ఓడిపొయ్యాడని అర్థం చేసుకున్నారు. అంతకు ముందు సీతాపతి రాష్ డ్రైవింగ్‌కి పై అధికారులకి రిపోర్టు ఇద్దామనుకున్నవాళ్ళు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. వెంటనే ప్రయాణీకులు కొందరు తమలో తాము చర్చించుకున్నారు. పది నిముషాలలో రెండు వందలుపోగుచేశారు. అందులో ఒక ప్రయాణీకుడు ఇచ్చిన యాభై రూపాయలు ఉంది. వాటిని పోగు చేసి ఒక ప్యాసింజరు వచ్చి సీతాపతికి ఇచ్చాడు. వాచీ పోయినందుకు బదులుగా తీసుకోమన్నాడు. సీతాపతికి గొంతు పూడుకుపోయింది. ఈ ఔదా



ర్యానికి. వద్దు. వద్దు అన్నాడు. కాని ప్యాసింజర్లు వినలేదు. బలవంతంగా చేతిలో పెట్టేరు. సీతాపతి మాట్లాడలేకపొయ్యాడు. టూరిస్టు బస్సు డ్రైవర్ వంక చూసేడు. టూరిస్టు బస్సు డ్రైవర్‌కి మొహంలో ఇంతకుముందు ఉన్న కళలేదు. తన చేతిలోని సీతాపతి వాచీవంక చూసేడు. తర్వాత సీతాపతి చేతిలో ప్యాసింజర్లు పెట్టిన డబ్బు చూసేడు. పందెం ఎవరు గెలిచారో అర్థం చేసుకున్నాడు. ★

